సాక్షి
నిజామాబాద్

శనివారం । 15 । జూలై । 2023



గల్ఫ్ వలసలపై సర్వే..

గ్రామాల్లో గల్ఫ్‌కు వెళ్లిన వారి వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు సేకరిస్తున్నారు.

- 8లో ▸



స్కీంపై మంత్రి సీరియస్..!

స్కీం పేరుతో స్కాం' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనంపై మంత్రి స్పందించి సంబంధిత నాయకులపై ఆగ్రహించినట్లు తెలిసింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /23.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా యాదిరెడ్డి

- చంద్రశేఖర్ సంగారెడ్డికి బదిలీ
- బోధన్ ఆర్డీవోగా రాజాగౌడ్





పి యాదిరెడ్డి చంద్రశేఖర్ రాజాగౌడ్

సుభాష్‌నగర్ : నిజామాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పి.యాదిరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్ అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థలు) సంగారెడ్డికి బదిలీపై వెళ్తున్నారు. చంద్రశేఖర్ ఫిబ్రవరి 12, 2020న జిల్లాకు బదిలీపై వచ్చారు. యాదిరెడ్డి గతంలో నిజామాబాద్ ఆర్డీవోగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ మార్క్‌ఫెడ్ ఎండీగా కొనసాగుతున్నారు. తాజాగా ఉత్తర్వుల ప్రకారం నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా బదిలీపై రానున్నారు.అలాగే బోధన్ ఆర్డీవోగా రాజాగౌడ్ బాన్సువాడ నుంచి బదిలీపై వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న రాజేశ్వర్‌ను జగిత్యాల జిల్లా కోరుట్లకు బదిలీ చేశారు. రాజేశ్వర్ ఆగస్టు 3,20 20 నుంచిబోధన్ ఆర్డీవోగా కొనసాగుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా మంద మకరంద్



నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మంద మకరంద్ రానున్నారు. ఈ మేరకు శుక్రవారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం జగిత్యాలలో అదనపు కలెక్టర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రెండేళ్లకు పైగా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. మకరంద్ 2020లో ఐఏఎస్‌గా ఎంపికై నిజామాబాద్ జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా 2021 వరకు ఏడాది పాటు విధులు నిర్వహించారు.రాజన్న సిరిసిల్లా జిల్లాలోని భీమని మల్లారెడ్డి పేటలో మకరంద్ బాల్యం సాగింది. మకరంద్‌కు బాల మేధావిగా, మంచి డ్యాన్సర్‌గా పేరుంది. ఆయన నృత్యాలకు సోషల్ మీడియాలో లక్షల్లో లైకులు వచ్చాయి. క్రీడల్లోనూ మున్సిపల్ కమిషనర్‌కు మంచి పట్టుంది. రెండు, మూడు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

టిక్కెటొస్తే ఓకే.. లేకుంటే జంపింగ్!

- మదిలో ఏ, బీ, సీ ప్లాన్
- ఆశావహులు, పార్టీలదీ ఇదే పరిస్థితి
- సర్వేలే ప్రామాణికమంటున్న పార్టీలు
- పార్టీ టిక్కెట్టుకు ప్రయత్నిస్తూనే ఇతర పార్టీలతో టచ్‌లోకి..
- మరోవైపు ప్రత్యర్థి పార్టీల ఆశావహులతో ముఖ్య నాయకుల మంతనాలు
- ఎప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రానున్న శాసనసభ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల కమిషన్ ప్రారంభించింది. తగిన ఏర్పాట్లు చేసేందుకు అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. ఇదిలా ఉండగా ఆయా రాజకీయ పార్టీలు, టిక్కెట్ల ఆశావహులు కార్యాచరణను ముమ్మరం చేశారు. జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు ఎంఐఎం సైతం నిర్ణయాత్మక ప్రాబల్యం కలిగి ఉన్నాయి. దీంతో పలుచోట్ల బహుముఖ పోటీ, కొన్ని చోట్ల త్రిముఖ, ద్విముఖ పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నాయి. ఆయా పార్టీలు ఏఏ స్థానాల్లో పోటీచేస్తే ఫలితాలు ఎలా తారుమారు అవుతాయనే విషయమై లెక్కలు వేసుకుంటున్నాయి. నిలబెట్టే అభ్యర్థులను బట్టి ఓట్ల క్రాసింగ్‌కు అవకాశాలు ఉండడంతో పార్టీల్లో గుబులు నెలకొంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ఎప్పటికప్పుడు వరుస సర్వేలు చేస్తూ ప్రజల నాడి తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రతి పక్షం రోజులకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారిపోతుండడంతో వివిధ వర్గాల ప్రజల ఆలోచన సరళి అంతుబట్టడంలేదని పార్టీల నాయకులు చెబుతున్నారు. దీంతో అన్నిరకాలుగా బలమైన అభ్యర్థుల వేటలో కాంగ్రెస్, బీజేపీలు చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. బీఫారాలు కేటాయించే సమయంలోనూ జంపింగ్‌లు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా అభ్యర్థులు తామున్న పార్టీలో ప్రయత్నాలు చేస్తూనే ఇతర పార్టీల కీలక నేతలతో టచ్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది. పార్టీలు సైతం తమకు గట్టి అభ్యర్థి లభించని పక్షంలో ప్రత్యర్థి పార్టీలో టిక్కెట్టు ఆశించి భంగపడిన గట్టి అభ్యర్థిని చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నాయి. ఆటు పార్టీలు, అటు అభ్యర్థులు ప్లాన్ ఏ,ప్లాన్ బీ, ప్లాన్ సీ అనేలా ముందుకు వెళుతున్నారు.

■ నిజామాబాద్ రూరల్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బరిలో ఉన్నారు. అయితే ఆయన తన కుమారుడు, ధర్పల్లి జెడ్పీటీసీ జగన్‌ను నిలబెట్టేందుకు కేసీఆర్‌ను అడుగుతున్నారు. బీజేపీ నుంచి దినేశ్ కులాచారి అభ్యర్థిగా చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డికి టిక్కెట్టు ఖ రారైనట్లు సమాచారం. ఈ టిక్కెట్టును పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్ రెడ్డి ఆశిస్తున్నారు. సినీ హీరో తన మేనల్లుడు నితిన్ ద్వారా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల మళ్లీ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ అరికెల తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

■ బోధన్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే షకీల్ ఉండగా ఈసారి టిక్కెట్టును ఆయన సతీమణి ఆయేషా ఫాతిమాకు ఇస్తారనే చర్చ నడుస్తోంది. బీజేపీ నుంచి మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి ఆశిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి రేసులో ఉన్నారు.

■ ఆర్మూర్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఉన్నారు. బీజేపీ నుంచి పార్టీలో ఇటీవల చేరిన పైడి రాకేష్‌రెడ్డి టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఇక్కడ ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి బీజేపీ టిక్కెట్టు రేసులో ముందున్నారు. కాంగ్రెస్ పార్టీ వినయ్‌రెడ్డిని చేర్చుకుని బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇక్కడి నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేయాలని పార్టీ శ్రేణులు, పలువురు రైతులు కోరుతుండడం గమనార్హం.

■ బాల్కొండలో మంత్రి వేముల బీఆర్‌ఎస్ సిట్టింగ్‌గా ఉన్నారు. బీజేపీ నుంచి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి తగిన ఏర్పాట్లలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి టిక్కెట్టుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికే సంప్రదింపుల ప్రక్రియ పూర్తి చేసింది. ఈ నెల 20న లేదా నెలాఖరులో సునీల్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది.

■ నిజామాబాద్ అర్బన్‌లో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ కవిత ఇక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చ కూడా నడుస్తోంది. బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ టిక్కెట్టు రేసులో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు టిక్కెట్టు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది.ఈ టిక్కెట్టు కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశ వేణు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా సర్వేల మేరకే టిక్కెట్లు అని పీసీసీ నాయకత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ స్థానం నుంచి ఎంఐఎం బరిలో ఉండనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎంఐఎం తరుపున టిక్కెట్టు కోసం బొబ్బిలి నర్సయ్య గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా నగర డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు షకీల్‌పాషా, మాజీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ మేయర్ ఫయీమ్, మాజీ కార్పొరేటర్ రఫత్‌ఖాన్ రేసులో ఉన్నారు. ఆయా పార్టీలు నిలబెట్టే అభ్యర్థులను బట్టి ఓట్ల క్రాసింగ్ ఉండనుండడంతో నిజామాబాద్ అర్బన్ సీటుపై ప్రత్యేక రాజకీయ పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఆయా పార్టీల, అభ్యర్థుల పరిస్థితులను బట్టి ఫలితం తారుమారయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. బహుముఖ పోటీ ఉంటే ఓట్ల చీలిక తీవ్ర ప్రభావం చూపనుంది.

ఓటర్ల జాబితాలో తప్పులు ఉండొద్దు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా

సుభాష్‌నగర్ : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దని, డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా జాబితాను బీఎల్‌ఓ మొదలుకుని ఈఆర్‌ఓ స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులు ఓటర్‌లిస్ట్‌లో గల్లంతు కావొద్దన్నారు. శుక్రవారం వీసీలో జిల్లా కలెక్టర్లతో సీఈఓ సమీక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. జూలై 28 నుంచి స్విప్ కార్యక్రమాలు విస్తృతం చేస్తూ, రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలన్నారు. ఈవీఎం గోదాంలకు భద్రత కల్పించాలన్నారు. జిల్లాలో ఎన్నికల అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ మృతి చెందిన, శాశ్వతంగా ఇతర ప్రాంతానికి తరలివెళ్లిన 73,924 మంది పేర్లను జాబితా నుంచి తొలగించామన్నారు. ఆరుగురు అంతకంటే ఎక్కువమంది ఓటర్లు ఉన్న ఇళ్లు జిల్లాలో 27,297 ఉండగా, ఇప్పటికే 25,692 నివాసాలలో పరిశీలన పూర్తయ్యిందన్నారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, తహశీల్దార్లతో సమీక్ష జరిపారు. ఈనెల 15వ తేదీ సాయంత్రంలోపు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, జెడ్పీ సీఈవో గోవింద్, డీసీఓ సింహాచలం, ఆర్డీఓలు రవికుమార్, రాజేశ్వర్ తదితరులున్నారు.

జిల్లాలో భారీ వర్షం

- రాగల రెండ్రోజులూ వానలే..

సుభాష్‌నగర్ : జిల్లాలో గడిచిన 24 గంటల్లో పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. నవీపేట్, బోధన్, ఎడపల్లి, రెంజల్, నిజామాబాద్ రూరల్, నార్త్, జక్రాన్‌పల్లి, తదితర మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. నవీపేట్‌లో అత్యధికంగా 106.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండ్రోజులు కూడా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షా లు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సీఎం పోస్టూ కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయాలి



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

ఖలీల్‌వాడి : తెలంగాణలో కాంటాక్ట్ ఉద్యోగాలే ఎక్కువని, భర్తీ చేసిన ఉద్యోగాలు తక్కువేనని సీఎం పోస్టును కూడా కాంట్రాక్ట్ బేసిస్‌లో పెడితే బాగుంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ చౌరస్తా వద్ద యూత్ కాంగ్రెస్ యువపోరాట బస్సు యాత్ర 9వ రోజు నిర్మల్ నుంచి జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ పోరాట యాత్ర మొదలుపెట్టినది నిరుద్యోగులకోసమేనన్నారు. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిస్వాన్ కమటీ ఉద్యోగ ఖాళీలు గుర్తించినప్పటికీ పూర్తిగా భర్తీ చేయలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 3.50 లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతిఏటా సెప్టెంబర్‌లో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్నారు.కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉండవన్న సీఎం మాట తప్పారన్నారు. 2018లో బీఆర్‌ఎస్ నిరుద్యోగ భృతి రూ. 3016 అందిస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఇప్పటిదాకా తెలంగాణలో ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వం రూ. 1.60 లక్షల బాకీ ఉందన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను నిరుద్యోగభృతి కోసం నిలదీయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగులిస్తామని మోసం చేసిందన్నారు. కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రాజస్థాన్‌లో మహిళలకు రూ. 500కే సిలిండర్ ఇస్తున్నామన్నారు.టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్, మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవేణు, యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తిగోపి, యువజనకాంగ్రెస్ నేతలు విక్కీయాదవ్, ప్రీతం,లవంగ ప్రమోద్ కుమార్, సాగర్, వేణురాజ్ పాల్గొన్నారు.

గోమాత సేవలో..

- ఇంటి ముందు ఆవు ఉండాల్సిందే..
- నగర వాసుల్లో పెరిగిన భావన
- శ్రమకోర్చి పెంచుతున్న గోప్రియులు

బి. ప్రభాకర్

భారతీయ సంస్కృతి, జీవన విధానంలో ఆవుకు ప్రత్యేక స్థానం ఉంది. ఆవును తల్లికి ప్రతిరూపంగా భావిస్తారు హిందువులు.. ఈ సెంటిమెంట్ ఇటీవల కాలంలో నగరం, పట్టణ వాసుల్లో మరింతగా పెరిగింది. ఆవును పెంచుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. పశు పోషణకు ఎదురయ్యే ఇబ్బందులను కూడా లెక్కచేయడం లేదు. ఇరుకైనా సరే కాంపౌండ్ వాల్ లోపల ఆవరణలో కాస్త స్థలం కేటాయించి ఆవును పెంచుతున్నారు. నిత్యం గోమాత సేవలో తరిస్తున్నారు. ఇంటి ముందు గోమాత ఉండాల్సిందేనంటున్నారు. అదే విధంగా హిందూ ధర్మాన్ని ఆచరించే సంస్థల సభ్యులు కొందరు గోవుల సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో, డ్రెయిజీలలో, గుంతల్లో పడి గాయాల పాలైన వాటికి సపర్యలు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. కబే ళాకు తరలించే గోవులను పట్టుకుని గోశాలలకు తరలిస్తున్నారు.



ఆవుతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు



ఆవుదూడతో మెరుగు శ్రీనివాస్ గౌడ్

■ చిన్నప్పటి నుంచి భూతదయ కలిగిన నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మెరుగు శ్రీనివాస్‌కు ఓ వ్యక్తి దగ్గరున్న ఆవుకు రక్షణ లేదని తెలిసింది. ఎప్పటికైనా కబేళాకు తరలిస్తారని భావించారు. దాని ప్రాణాలు కాపాడేందుకు రెట్టింపు డబ్బులు ఇచ్చి తానే కొనుగోలు చేశారు. ఉదయం లేవగానే మొదట ఆవు ముఖం చూస్తారు. ఆవుకు దానా పెట్టి సపర్యలు చేస్తారు. ఆవును పెంచుతున్నప్పటి నుంచి తనలో తెలియని ఆధ్యాత్మిక భావం ఏర్పడుతోందంటున్నారు. తన ఇంటికి సరిపోను మిగిలిన ఆవు పాలను తెలిసిన వారికి ఉచితంగానే ఇస్తారు.

గోసంరక్షణలో హిందూ ఐక్యవేదిక

ఆవుల సంరక్షణలో నిజామాబాద్ నగరంలోని హిందూ ఐక్యవేదిక సేవలు అనన్యం.. నగరంలో ఓపెన్ డ్రెయినేజీల్లో ఆవులు పడిపోయి గాయాల పాలు కావడం.. రోడ్లపై తిరిగే ఆవులు ప్రమాదాలకు గురికావడం సహజంగా మారింది. ఆవుకు ప్రమాదం వచ్చిందని తెలిస్తే చాలు హిందూ ఐక్యవేదిక సభ్యులు క్షణాల్లో అక్కడ వాలిపోతారు. ఆవులను డ్రెయినేజీల్లోంచి తీసి రక్షిస్తారు. పశు వైద్యులను పిలిపించి చికిత్స చేయిస్తారు. చనిపోయిన ఆవులకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఏడాది కాలంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇప్పటివరకు 120 వరకు గోవులను, నందులను రక్షించారు. 80 వరకు గోమాతలు, నందులకు అంత్యక్రియలు నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా కన్వీనర్గా దాత్రిక రమేశ్ నియామకమైన తరువాత గోవుల రక్షణ కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ బృందంలో బీజేపీ ఐటీ సెల్ నరేష్ గౌడ్, ఆశిష్, ప్రిన్స్ సాయి, హిందూ వాహిని నగర అధ్యక్షులు శ్రీకాంత్, బినయ్, రణధీర్, శైలేశ్, మను ఆర్యాసమాజ్ గంగాధర్ ఆర్యా , బీజేపీ కార్పొరేటర్లు పంచరెడ్డి శ్రీధర్, ఎర్రం సుధీర్, మాస్టర్ శంకర్, ఇప్పకాయల కిషోర్, జేసీపీ లక్ష్మినారాయణ, అడ్వొకేట్ భిక్షపతి, గోసేవకులు సాకేత్, సాయి, హరీశ్,ఎడ్ల రాముజీ, చారి, కాసాబ్ గల్లీ నరేష్, సుహాస్ తదితరులు ఉన్నారు. 2019 నుంచి గోసేవ చేస్తున్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాథమిక శిక్ష వర్గ పూర్తిచేసుకొన్న తర్వాత గోమాత విశిష్టత తెలిసిందని ధాత్రిక రమేశ్ పేర్కొన్నారు.



ఇంటి ఎదుట ఆవుతో ఆది శ్రీనివాస్ దంపతులు

■ నగరంలోని రోటరీ నగర్‌కు చెందిన ఆది శ్రీనివాస్ గౌడ్ ప్రతి ఏటా అయ్యప్ప మాల వేస్తారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన ఆయన ఏటా దేశంలోని ఏదో ఒక ప్రముఖ పుణ్య క్షేత్రాన్ని సందర్శిస్తారు. కరోనా కాలానికి ముందు ఓ 70 ఏళ్ల వృద్ధుడు తన వద్ద ఉన్న ఆవును వయోభారంతో పోషకర్తణ చేయలేక పోతున్నానని చెప్పడంతో శ్రీనివాస్ కొనుగోలు చేసి పోషిస్తున్నారు. కరోనా సమయంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లలేక పోయిన తాను, తన కుటుంబం అప్పటి నుంచి ఆవులోనే దైవత్వాన్ని చూసుకుంటున్నామని చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం లేవగానే ఆవును దర్శించుకుని దానా పెట్టి మొక్కుతారు. ఆవును పోషించేందుకు ప్రత్యేకంగా దానా చార్ట్‌ను తయారు చేయించారు. ఇళ్ల చుట్టు పక్కల వారు ఎవరైనా దానా పెట్టేందుకు వస్తే ఏదిపడితే అదికాకుండా చార్ట్ ప్రకారం దానా పెట్టాలని సూచిస్తారు.

■ నగరంలోని సాయినగర్‌కు చెందిన శ్రీకాంత్ గౌడ్(రైల్వే బోర్డు సభ్యుడు) కుటుంబ సభ్యులు గోశాల నుంచి ఆవును తెచ్చుకుని పెంచుతున్నారు. ఇంటి సభ్యులు ఉదయం లేవగానే ఆవును దర్శించుకుని మొక్కుతారు. ప్రతిరోజు ఆవుకు అందించే సేవలతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని చెబుతున్నారు.



నగరంలో డ్రెయినేజీలో పడిన ఆవును తీసిన హిందూ ఐక్య వేదిక సభ్యులు



గోవును బాధ్యతగా పెంచాలి

ఆవును పెంచుకునే ఆసక్తి గల వారు సంప్రదిస్తే గోశాలల నుంచి ఇప్పిస్తాం.. అయితే వాటి సంరక్షణ బాధ్యతలపై బాండ్ పేపర్ రాసివ్వాల్సి ఉంటుంది. ఇటీవల ఆవును, పిల్లను కబేళాలకు తరలిస్తున్న సమాచారం రావడంతో అర్ధరాత్రి వెళ్లి రక్షించి గోశాలకు తరలించాం. ప్రస్తుతం గోశాలలో సురక్షితంగా ఉన్నాయి. అదేవిధంగా పశువులను లోడ్‌కు మించి తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకుని పోలీసులకు అప్పగించాం. కేసు నమోదైంది. నగరంలో ఆవులు ప్లాస్టిక్ కవర్లు తిని చనిపోతున్నాయ్.

– ధాత్రిక రమేశ్, హిందూ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్



నగరంలో డ్రెయినేజీలో పడిన ఆవుదూడ

• నేడు మంచినీటి సరఫరా బంద్

నిజామాబాద్ నాగారం : నగరంలో శనివారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగారం, ఇంద్రాపూర్, వినాయక్‌నగర్, గోల్‌హన్మాన్, ఎల్లమ్మగుట్ట, సుభాష్‌నగర్, నాందేవ్‌వాడ, గంగాస్థాన్, హమాల్‌వాడి, దుబ్బ, గౌతంనగర్, కంఠేశ్వర్, చంద్రశేఖర్‌కాలనీ, పోచమ్మగల్లి, అర్సపల్లి, మాలపల్లి, హైమద్‌పురా కాలనీ, హబీబ్‌నగర్ కాలనీల్లో సరఫరా ఉండదన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 17న జరగాల్సిన డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 3వ, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను బోనాల పండుగ కారణంగా వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను తిరిగి 18న నిర్వహిస్తామని తెలిపారు.

ఐదో సెమిస్టర్ పరీక్ష ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఐదో సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షలో ఆరుగురు విద్యార్థులకు అందరూ హాజరైనట్లు కంట్రోల్ తెలిపారు.

ప్రాక్టికల్ పరీక్ష తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీల్లో మార్పు చేసినట్లు కంట్రోలర్ తెలిపారు. సెట్-1 గ్రూప్-ఏ సంబంధిత కళాశాలల్లో ఈ నెల 19 నుంచి 24 వరకు, గ్రూప్-బీ కళాశాలల్లో ఈ నెల 27 నుంచి ఆగస్టు 2వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే సెట్- 2 లో స్టాటిస్టిక్స్ ప్రాక్టికల్ /ప్రాజెక్టు పరీక్షలు గ్రూప్- ఏ సంబంధిత కళాశాలల్లో జూలై 25, 26వ తేదీల్లో, గ్రూప్-బీ సంబంధించిన కళాశాలల్లో ఆగస్టు 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ తెలిపారు.

18 లోపు ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈ నెల 18వ తేదీలోపు చెల్లించాలని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 20వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు.

ఏసీబీ సిబ్బందికి సేవా పతకాలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ అవినీతి నిరోధక శాఖలో పనిచేస్తున్న ఎస్సై నగేశ్‌కు సేవా పతకం, కానిస్టేబుల్ సురేష్‌కు ఉత్తమ సేవా పతకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎస్సై నగేశ్ రెండేళ్లుగా ఏసీబీలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 14 కేసులలో దాడులు చేసి కేసులు నమోదు చేశారు. కానిస్టేబుల్ సురేష్ ఏసీబీలో ఆరేళ్లుగా పని చేస్తున్నారు. వారిని డీఎస్పీ ఆనంద్‌కుమార్, ఏసీబీ సిబ్బంది అభినందించారు.

గల్ఫ్ వలసలపై సర్వే!

- గ్రామాల్లో వివరాలను సేకరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో రంగంలోకి దిగిన ఉద్యోగులు



సుంకెట్‌లో గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి వివరాలను నమోదు చేసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మోర్తాడ్(బాల్కొండ): మీ ఇంట్లో ఎవరైనా గల్ఫ్ వెళ్లారా.. ఏ దేశం వెళ్లారు... ఏం పని చేస్తున్నారు... పేరు, మొబైల్ నంబర్ చెప్పండి నోటు చేసుకుంటాం అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో గల్ఫ్ వలసలపై సర్వే నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అధికార యంత్రాంగం మౌఖిక ఆదేశాలతో రెండు రోజుల నుంచి బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వలస కార్మికుల వివరాల నమోదు కార్యక్రమం కొనసాగుతుండటం గమనార్హం. గల్ఫ్ వలసలలో ప్రథమ స్థానంలో ఉన్న బాల్కొండ నియోజకవర్గంలో వివరాల నమోదు ఆరంభం కావడం పరిశీలిస్తే రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెనిఫెస్టోలో సంక్షేమ అంశం చేర్చుతారా అని చర్చ జరుగుతుంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే వలస కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం కల్పించే విషయమై ఏదైనా పథకం అమలు చేస్తారా అని కూడా పలువురు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో వలస కార్మికులకు ఎంతో కొంత న్యాయం జరిగిందని ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తరువాతనే వలస కార్మికుల సంక్షేమం మరుగునపడిందనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణలోని 32 నియోజకవర్గాలలో గల్ఫ్ ప్రవాసులు అభ్యర్థుల గెలుపు ఓటములపై ప్రభావం చూపే అవకాశం ఉందని గతంలోనే ఇంటలిజెన్స్ విభాగం తేల్చింది. 25 వేల నుంచి 30వేల ఓట్ల ప్రభావం ఉన్న నియోజకవర్గాలను ఏ కేటగిరిగా, 10వేల నుంచి 20 వేల ఓట్ల ప్రభావం చూపే నియోజకవర్గాలను బీ కేటగిరిగా పేర్కొంటూ ప్రభుత్వానికి ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) అధికారులు నివేదికలను అందించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశాలకు ముందుగా ఈ సర్వేను అధికారులు నిర్వహించారు. ప్రవాసుల సంక్షేమం కోసం నిధులను కేటాయించడానికి సర్వే కొనసాగిస్తున్నారని అందరు భావించారు. బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం, వలస కార్మికుల ఊసెత్తకపోవడంతో అప్పట్లో అసంతృప్తి వ్యక్తమైంది. చివరకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి ఇంటింటి సర్వేకు తెరలేపడంతో ప్రవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల నిర్దిష్టమైన సమాచారం ఏది లేదు. ఎన్‌ఆర్‌ఐ సెల్ ఉన్నా వలస కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో వలసల సమాచారం లోపించిందనే ఆరోపణలు ఉన్నాయి.

ఇరాక్ సంక్షోభం సమయంలో సర్వే

తెలంగాణ ఆవిర్భావం తరువాత ఇరాక్‌లో అంతర్యుద్ధం మొదలై ఆ దేశం సంక్షోభంలోకి కూరుకపోయింది. అప్పట్లో ఇరాక్‌లో తెలంగాణ వలస కార్మికుల సంఖ్య గణనీయంగా ఉండటంతో ఆ దేశానికి వలస వెళ్లిన వారి వివరాలను పక్కాగా సేకరించాలని సీఎం చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఉద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం ఇరాక్‌కు వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేసింది. అంతలోనే అంతర్యుద్ధం ముగిసిపోవడంతో ఎలాంటి పథకాలు అమలు చేయకుండానే కాలం గడచిపోయింది. తాజాగా గల్ఫ్ వలస కార్మికుల సంఖ్యను తేల్చడానికి సర్వే నిర్వహిస్తుండటంతో చర్చనీయాంశంగా మారింది.

సర్వేలతో సరిపెడితే ఏం లాభం



ఎన్నికల సమయంలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల వివరాలను నమోదు చేసుకోవడానికి సర్వే నిర్వహించడం, ఎన్నికల తర్వాత వారిని మరిచిపోవడం ఈ ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. సర్వే చేస్తే ఏం లాభం. వలస కార్మికుల కోసం పథకాలను పక్కాగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– గుగ్గిల్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ చైర్మన్

స్కీం పేరుతో స్కాంపై మంత్రి సీరియస్

- 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందించిన మంత్రి
- 15 రోజుల్లో స్కీం సభ్యులకు డబ్బులు వాపసు చేయాలని ఆదేశం
- తప్పు చేసి పార్టీకి చెడ్డపేరు తీసుకువస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక

మోర్తాడ్(బాల్కొండ): స్కీం పేరుతో స్కాం చేసిన నాయకులపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. స్కీం పేరుతో స్కాం అనే శీర్షికన ఈనెల 12న సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన మంత్రి స్కాంకు బాధ్యులైన నాయకులను పిలిపించుకుని మాట్లాడినట్లు అధికార బీఆర్‌ఎస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. దొన్కల్ కేంద్రంగా స్కీం నిర్వహించిన నాయకులు స్కీం కాలపరిమితి ముగిసినా సభ్యులకు బహుమతులు ఇవ్వకపోవడం చివరకు డబ్బులు వాపసు చేయకపోవడంతో అనేక మంది ఆందోళన చెందుతున్న విషయం విదితమే. స్కీం పేరుతో వసూలు చేసిన సొమ్మును నాయకులు రియల్ ఏస్టేట్ వ్యాపారంలోకి మళ్లించడం, సభ్యులను ఇబ్బందులకు గురిచేయడంతో పార్టీకి చెడ్డపేరు వస్తుందని మంత్రి నాయకులతో అన్నట్లు తెలిసింది. పదిహేను రోజుల్లో స్కీం డబ్బులను వాపసు చేయడం లేదా సభ్యులకు బహుమతులు ఇవ్వడం పూర్తి కావాలని లేకుంటే బాగుండదని హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది. స్కీం విషయంలో ఇద్దరు నాయకులు తగువులాడుకోగా ఈ పరిస్థితిని చక్కబెట్టాల్సిన బాధ్యతను మండల స్థాయి ప్రజాప్రతినిధి ఒకరికి అప్పగించినట్లు పార్టీలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. పార్టీ కార్యక్రమాల నిర్వహణకు నెలా నెలా డబ్బులు పంపిస్తున్నా నాయకులు అక్రమ మార్గంలో నడవడం ఎంతవరకు సమంజసం అని మంత్రి ప్రశ్నించారని తెలిసింది. ప్రజలతో జాగ్రత్తగా మెదలాలని ఎవరిని ఇబ్బంది పెట్టినా ఎంతటి స్థాయి నాయకుడైనా ఉపేక్షించేది లేదని మంత్రి సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిప్పితే చర్యలు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాకర్ ఫారంలో పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

రుద్రూర్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోతంగల్ మండలం బాకర్‌ఫారం, కారేగాం గ్రామాల్లో శుక్రవారం రాత్రి స్పీకర్ పర్యటించి పనులను పరిశీలించారు. కారేగాంలో రూ.10లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న బీటీ రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తీసుకు రావొద్దన్నారు. రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిప్పె వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ శంకర్ పటేల్, పోచారం సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం ఆందోళన

- ఈ నెల 4 నుంచి సమ్మె చేస్తున్న పార్ట్ టైం స్వీపర్లు
- పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్



కామారెడ్డిలో ధర్నా చేస్తున్న ఉమ్మడి జిల్లా స్వీపర్లు

మోర్తాడ్: ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్ టైం ప్యూన్‌లుగా పని చేస్తున్న కింది స్థాయి ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఏళ్ల తరబడి చాలీ చాలని వేతనంతో ఇబ్బంది పడుతున్నామని పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4 నుంచి సమ్మె కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో 29 మంది, కామారెడ్డి జిల్లాలో 60 మంది ప్యూన్‌లు ఉన్నారు. దాదాపు 30 ఏళ్లుగా వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.4వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. పేరుకే పార్ట్ టైం ప్యూన్ అయినప్పటికి పూర్తి స్థాయి పని వేళల్లో బాధ్యతలను నిర్వహిస్తున్నామని వారు పేర్కొంటున్నారు. గతంలో ఉదయం పూట పాఠశాలకు వచ్చిన ఊడ్చి నీరు పెట్టి వెళ్లేవారిమని కాలక్రమంలో పాఠశాల ఆరంభం నుంచి మూసివేసే వరకు విధులు నిర్వహించాల్సి వచ్చిందని వారు వివరించారు. తమకు కనీసం నెలకు రూ.20వేల వేతనం చెల్లించాలని వేడుకుంటున్నారు. తమలో ఎంతో మందికి అర్హత ఉన్నా నాలుగో తరగతి ఉద్యోగులుగా పదోన్నతి కల్పించలేదని వారు తెలిపారు. ప్యూన్‌ల సమ్మెతో పాఠశాలలను శుభ్రం చేసేవారు కరువయ్యారు.

ప్రభుత్వ తీరుతో డిఫాల్టర్లుగా రైతులు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల

మోర్తాడ్: ఎన్నికల ముందు ఇచ్చిన రుణమాఫీ హామీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేక రైతులను బ్యాంకుల దృష్టిలో ఎగవేతదారులుగా ఉంచిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మాట తప్పడంలో బీఆర్‌ఎస్‌తో పోటీపడేవారు ఎవరు లేరని ఎద్దేవా చేశారు. శుక్రవారం మోర్తాడ్ మండల పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.2లక్షల రుణ మాఫీ అమలు చేస్తుందన్నారు. సహకార సంఘాలు, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు రిబేట్ చెల్లించే పద్ధతిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఉచిత విద్యుత్ పేటెంట్ హక్కులు కాంగ్రెస్ పార్టీవేనని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వక్రీకరించిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాము లు, సుంకెట్ రవి, సోమ దేవారెడ్డి, గురిజాల నర్స య్య, బూత్పురం మహిపాల్, ఆడెపు గంగాప్రసాద్, రొక్కం మురళి, బద్దం రాజశేఖర్, సుధీర్, గిర్మాజి గోపి పాల్గొన్నారు.

దోస్త్ స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ప్రవేశాల కోసం 'దోస్త్ –2023' లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ (దివ్యాంగులు, క్యాప్, ఎన్‌సీసీ, ఇతర విభాగాల) అభ్యర్థుల సర్టిఫికెట్ లను శుక్రవారం పరిశీలించారు. వర్సిటీ పరిపాలనా భవనంలోని అకడమిక్ ఆడిట్ సెల్ విభాగంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను దోస్త్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ పరిశీలించారు. ఎన్‌సీసీకి సంబంధించి ఏడుగురు, దివ్యాంగులకు సంబంధించి ఒకరు హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఠాణాను తనిఖీ చేసిన ఏసీపీ



ధర్పల్లి: ధర్పల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. రిసెప్షన్, రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలోని నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీశారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలను చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాత నేరస్తులపై నిఘా పెట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బాన్సువాడ రూరల్: మండలంలోని బుడ్మి చౌరస్తా వద్ద శుక్రవారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ నుంచి మద్దెల్‌చెర్వు వైపు బోలేరో వ్యాన్ వెళ్తుండడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా వాహనంలో 32 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉందన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగింది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో 8165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా 4350 క్యూసెక్కుల నీరు వస్తోంది. మొత్తంగా ప్రాజెక్ట్‌లోకి 12,515 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 406 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1067.40(24.21 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

క్రైం కార్నర్

డ్రెయినేజీలో పడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావు కాలనీలో షేక్ అహ్మద్ (47) మురికి కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. షేక్ అహ్మద్ ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి పనులు ముగించుకొని వెళ్తుండగా ఇంటి ముందు ఉన్న డ్రెయినేజీలో కాలు జారి పడి చనిపోయాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

అశోక్‌సాగర్‌లో పడి మహిళ..

ఎడపల్లి: మండలంలోని అశోక్‌సాగర్‌లో పడి బోధన్ మండలంలోని చెక్కి క్యాంపుకు చెందిన పన్నెలి భారతి (55) మృతి చెందినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. భారతికి మతిస్థిమితం లేక పోవడంతో ఈనెల 8న ఇంటి నుంచి వెళ్లినట్లు చెప్పారు. మృతురాలి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

హై వోల్టేజీతో కాలిపోయిన టీవీలు

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో హైవోల్టేజీ, లోవోల్టేజీ విద్యుత్తు సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం గ్రామంలో హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. గ్రామంలోని విద్యుత్ సమస్యపై ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

బిచ్కుంద: మండలంలోని ఫత్లాపూర్‌లో శుక్రవారం ఓ ఉపాధ్యాయుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని నిలదీసి దేహశుద్ధి చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సాయిలు(ఫైల్)

లింగంపేట: మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన ఈరన్న సాయిలు(26) గురు వారం గ్రామ శివారులోని పటేల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సాయిలుకు తన సోదరుడితో ఆస్తి తగదాలు ఉన్నాయి. సాయిలు, అతని భార్య లావణ్య ఈ నెల 12న పర్మళ్లలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ భార్యాభర్తల మధ్య పొలానికి సంబంధించిన పట్టా పాసుపుస్తకం విషయంలో గొడవ జరిగింది. ఈ విషయంలో తన బావమరిది రాజేష్, వదిన కిష్టవ్వ, నక్క సాయిలు, భార్య లావణ్య సాయిలును కొట్టి బైకు లాక్కొని పంపించారు. అదే రోజు సాయిలు తన స్వగ్రామానికి వచ్చాడు. గురువారం కుల పెద్దలు ఎల్లన్న, ఎల్లయ్యలకు తన బాధ చెప్పారు. సాయంత్రం గ్రామ శివారులోని పటేల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇస్లాంపుర కాలనీలో చోరీ

- 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు దొంగతనం



ఘటనపై ఆరా తీస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీ ఇస్లాంపురా కాలనీలో గురువారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్లాంపూర కాలనీలో నివాసముంటున్న అమ్జద్‌హుస్సేన్, అతడి భార్య గరీబున్నిసాబేగం నెల రోజులు క్రితం కరీంనగర్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. గరీబున్నీసాబేగం తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో అక్కడే ఉండిపోయారు. వారి కుమారుడు అర్షద్, కూతురు అర్షిన్ ఫాతిమా మూడు రోజుల క్రితం కామారెడ్డికి వెళ్లి గురువారం సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రికి ఇంటికి తాళం వేసి అదే కాలనీలోని బావ ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువా, అల్మారాలను ధ్వంసం చేసి 30 తులాల బంగారం, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు బీరువాలోని రూ.10లక్షల నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయాన్నే ఇంటికి వచ్చిన అర్షద్, అర్షిన్ ఫాతిమా తాళం పగులగొట్టి ఉండటం చూసి లోనికి వెళ్లి చూడగా బీరువా, అల్మారాలు తెరిచి ఉండటంతో చోరీ జరిగిన విషయాన్ని కరీంనగర్లో ఉన్న తల్లిదండ్రులకు, డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై గణేష్ లు బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్‌కు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కరీంనగర్ లో ఉన్న బాధితులు అమ్జద్, గరీబున్నీసాబేగం ఇంటికి చేరుకుని డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

3 నెలల క్రితమే సౌదీ నుంచి..

బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లిన అమ్జద్ మూడు నెలల క్రితమే ఇంటికి వచ్చారు. ఘన్‌పూర్ ఇస్లాంపురా కాలనీలో భార్యా పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. సొంత ఇల్లు కొనుగోలు చేయాలనుకుని రూ.10లక్షలు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఇల్లు కొందామనుకునే లోగానే దొంగలు నగలు, డబ్బులు ఎత్తుకెళ్లడంతో బాధితులు రోదిస్తున్నారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

రెంజల్: రెంజల్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన సదరు విద్యార్థినులు మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. రోజూ ఇంటి నుంచి పాఠశాలకు వస్తుంటారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వెళ్లిన వారు ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాఠశాలలో ఆరా తీశారు. అక్కడ ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థినుల కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని పారిపోయిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు శుక్రవారం రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన పోల లక్ష్మి మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు మాక్లూర్ మండలానికి చెందిన ప్రభునాథ్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. అతడి నుంచి పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై లింబాద్రి, సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని గొల్లవాడ వద్ద కరెంట్ షాక్‌తో శుక్రవారం గేదె మృతి చెందింది. రైతు ముదాం సాయిలు గేదె మేతకు కరెంట్ షాక్‌తో మృతి చెందింది. అధికారులు తనకు పరిహారం ఇప్పించాలని బాధితుడు కోరారు.